క్లుప్తంగా

గురునానక్ బోధనలు స్మరించుకుందాం



గురునానక్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్అర్బన్: విశ్వ మానవాళి శ్రేయస్సు కోసం అన్నిమతాలను సమ దృష్టితో చూడాలన్న గురునానక్ బోధనలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని బీజేపి నాయకుడు అరిగెల మల్లిఖార్జున్ అన్నారు. గురునానక్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి గురునానక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, మాటూరి జయరాజ్, సత్తన్న, శ్రీకాంత్, వెంకన్న, క్రిష్ణ, బాదుపటేల్, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

ఆసిఫాబాద్అర్బన్: పవిత్ర కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్‌నార్ రమేశ్ ఆధ్వర్యంలో మండలంలోని ఎల్లారం గ్రామస్తులు ఆసిఫాబాద్ కేస్లాపూర్ పెద్దవాగు సమీపంలోని హనుమాన్ ఆలయానికి పాదయాత్రగా చేరుకొన్నారు. అనంతరం పెద్దవాగులో స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ తీర్థప్రసాద వితరణ చేశారు.

కోచింగ్ లేకుండానే కొలువు



దయాసాగర్

కౌటాల: మండల కేంద్రానికి చెందిన డొంగ్రే సురేశ్, జ్ఞానసుందరి దంపతుల కుమారుడు దయాసాగర్ గ్రూప్‌- 4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపిక య్యాడు. బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేసిన దయాసాగర్ ఇంటి వద్దే సన్నద్ధమయ్యాడు. కొలువు సాధించిన అతడిని కుటుంబ సభ్యులు, స్థానికులు అభినందించారు.

గుడుంబా పట్టివేత



పట్టుకున్న గుడుంబాతో పోలీసులు

కౌటాల: మండలం గుడ్లబోరి గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న గుడుంబాను శుక్రవారం సాయంత్రం కౌటాల ఎస్సై మధుకర్ పట్టుకున్నారు. చింతలమానెపల్లి మండలం రణవెల్లి గ్రామానికి చెందిన జాటోత్ దేవ్‌సింగ్ బైక్‌పై 20 లీటర్ల గుడుంబాను కౌటాల మండలం గుండాయిపేట గ్రామానికి తరలిస్తుండగా గుడ్లబోరి సమీపంలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బైక్‌ను సీజ్ చేసి, అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిర్యాణి: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో అంజయ్య తెలిపారు. అటెండర్ పోస్టు 1, అసిస్టెంట్ కుక్ 2, స్కావెంజర్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అటెండర్ పోస్టుకు పదో తరగతి, మిగతా పోస్టులకు ఏడో తరగతి ఉత్తీర్ణత అయి ఉండాలన్నారు. ఈనెల 20లోగా మాణిక్యపూర్‌లోని కేజీబీవీలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

కొనసాగుతున్న సర్వే



సర్వేను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

కెరమెరి: ఓ వైపు అందరు కార్తిక పౌర్ణమి చేసుకుంటుంటే.. ఎన్యుమరేటర్లు మాత్రం సర్వేలో నిమగ్నమైయ్యారు. సమగ్ర కుటుంబా సర్వేలో భాగంగా శుక్రవారం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 806 కుటుంబాలను సర్వే చేశారు. మండలంలో మొత్తం 10,037 కుటుంబాలు ఉన్నట్లు ఎన్యుమరేటర్లు గుర్తించారు. ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, ఎంఈవో ఆడే ప్రకాశ్ సర్వేను పర్యవేక్షించారు.



సిర్పూర్(టి): ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



చింతలమానెపల్లి: హనుమాన్ ఆలయంలో గోపాల కాల నిర్వహిస్తున్న భక్తులు



చింతలమానెపల్లి: పూజలు చేస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి

జిల్లా వ్యాప్తంగా ప్రజలు శుక్రవారం కార్తికపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో భక్తులతో కిక్కిరిశాయి. ఇంటి ఆవరణలోని తులసీ చెట్టుకు పూజలు చేశారు. సాయంత్రం ఇంటి ఆవరణలో దీపాలు వెలిగించారు. వాంకిడి మండలంలోని ఖమాన గ్రామంలోని పూలాజీ బాబా భక్తులు ఉదయం 3 గంటలకే దీపాలతో ఉత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆ తరువాత భజన కీర్తనలతో సమీపంలోని వాగులో దీపాలను వదిలారు.

– సాక్షి, నెట్‌వర్క్



కౌటాల: వార్ధా నదిలో పూజలు చేస్తున్న భక్తులు



బెజ్జూర్: శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



రెబ్బెన: శివలింగానికి హారతి ఇస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: భజన చేస్తున్న భక్తులు

ఘనంగా బిర్సాముండా జయంతి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్



చింతలమానెపల్లిలో..



నివాళులర్పిస్తున్న నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: గిరిజన యువత బిర్సాముండాను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గిరిజన గ్రామాల్లో బిర్సాముండా 150వ జయంతిని పురష్కరించుకొని జన జాతీయ గౌరవ్ దివాస్ కార్యక్రమంలో భాగంగా పెసా గ్రామసభలు నిర్వహించారు. చౌపన్‌గూడా, పాతగూడలో నిర్వహించిన గ్రామసభల్లో ఎంపీడీవో పాల్గొని పెసా చట్టం, అటవీహక్కు చట్టం, అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన కల్పించారు.

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం బిర్సాముండా జయంతి నిర్వహించారు. ఎంపీవో సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఆసిఫ్ అలీ, ఆదివాసీ నాయకులు బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పెసా చట్టాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛతపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

బెజ్జూర్: స్వాతంత్ర సమరయోధుడు బిర్సాముండా జయంతి వేడుకలను ఆదివాసీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల సర్‌మెడి కుడప శంకర్ మాట్లాడుతూ ఆయన స్ఫూర్తితో హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, కొడప శంకర్, బూడిది బాపు, మానేపల్లి మల్లేష్, తొర్రెమ్ ప్రశాంత్, ఏనుక అమృత, చెంచులక్ష్మి, మడ శేఖర్, మడావి కిరణ్ పాల్గొన్నారు.

బిర్సాముండా పోరాటం అనుసరణీయం

ఆసిఫాబాద్అర్బన్: అడవుల్లోని ఆదివాసీలకు హక్కులు కల్పించాలని బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా సాగించిన పోరా టం అనుసరణీయమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సచిన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన అటవీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కుల రక్షణకు మరోపోరాటం నిర్వహించాల్సిన అవస రం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నా యకులు మాలశ్రీ, అశోక్, శ్రీనివాస్, బక్క న్న, రాజు, దుర్గం దినకర్, రాజేందర్, టీకా నంద్, కూశన రాజన్న తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అభివృద్ధి చెందాలి

కౌటాల: గిరిజనులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని మాజీ సర్పంచ్ మడావి రేణుక అన్నారు. శుక్రవారం బిర్సాముండా జయంతి వేడుకల్లో భాగంగా కౌటాల మండల వీర్దండి గ్రామంలో గిరిజన గౌరవ దినోత్సవ సమారోహము కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

జన జాతీయ ఉత్కర్ష్ అభియాన్‌పై అవగాహన

కెరమెరి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనజాతీయ ఉత్కర్ష్ అభియాన్‌పై శుక్రవారం మండలంలోని దేవాపూర్, జయరాంగూడ, కరంజివాడ, శంకర్ గూడ, అనార్‌పల్లి గ్రామాల్లోని ప్రజలకు ఎస్సీఆర్‌పీ నరేశ్ అవగాహన కల్పించారు. గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం నూతన పథకాలను తీసుకువచ్చి అభివృద్ధి బాటలో నడిపిస్తుందన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ గ్రామీణ్ పక్కా గృహాలు, విద్యుత్, సౌర విద్యుత్, గ్రామ సడక్ యోజన, జల్ జీవ న్‌ మిషన్, ఆరోగ్య మిషన్‌పై అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న నరేశ్

కార్యక్రమంలో టీచర్లు వినోద్, చంద్రకాంత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు..!



లింగాపూర్‌- గోపాల్‌పూర్‌తండా రోడ్డు మార్గంలో ఉన్న మూలమలుపు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్లపై మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. అయితే మూలమలుపుల వద్ద అధికారులు కనీసం సూచక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. లింగాపూర్ నుంచి గోపాల్‌పూర్, మీదుగా పంగిడి మాదురా వెళ్లే మార్గంలో అధికంగా మలుపులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కలప పట్టివేత

సిరికొండ: మండలంలోని కోండపూర్ గ్రామంలో గురువారం రాత్రి అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రూ.60 వేలు విలువ చేసే కలపను పక్కా సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో స్వామి తెలిపారు. కలపను అటవీశాఖ కార్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గంగమ్మకు పోటెత్తిన భక్తజనం



గంగనదికి హారతులు ఇస్తున్న భక్తులు

కెరమెరి: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని గంగనదికి శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రమిదలను నీటిలో వదిలారు. మహిళలు అందరు నది తీరంలో కూర్చుని ప్రమిదలను సుందరంగా అలంకరించారు. మంగళహారతులు ఇచ్చి మొక్కుకున్నారు. అనంతరం శివాలయం ఆవరణలో మహా అన్నదానం నిర్వహించారు.



ప్రమిదలు వదులుతున్న భక్తులు

భక్తి మార్గంలో నడవాలి



ప్రవచనాలు బోధిస్తున్న స్వాములు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని పీఠాధిపతి చిన్మయానందగిరి స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని మోతుగూడ వేదాంత విచారణ ధ్యాన నిస్త్రాశ్రమంలో కార్తిక మాసం పురష్కరించుకొని మూడు రోజుల పాటు ప్రత్యేక భక్తి ప్రవచన కొనసాగాయి. ఉదయం సుప్రభాత సేవ, సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఆధ్యాత్మికతో మానవుని జీవితంలో ప్రశాంత ఉంటుందన్నారు. కార్యక్రమంలో సత్యానందగిరి స్వామి, చరణానంద భారతి స్వామి, తుమ్మె మహరాజ్, భక్తులు పాల్గొన్నారు.

చర్యలకు వెనుకడుగు

- ఒక్క పనికి రెండుసార్లు బిల్లులు డ్రా
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు



బెజ్జూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీ పరిధిలో లక్షల రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయి. ఒకటే పనికి రెండుసార్లు బిల్లులు డ్రా చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. నిధులు వృథా కావడంతో పాటు చేపట్టిన పనులు సైతం నాసిరకంగా ఉండడంతో అవి కూడా మున్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. నిధులు దుర్వినియోగమైనట్లు ఫిబ్రవరి, 2024లో కాగజ్‌నగర్ డీఎల్‌పీవో విచారణ జరిపి తేల్చినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేయడం విమర్శలకు తావిస్తోంది. బెజ్జూర్ గ్రామపంచాయతీలో 2022లో రూ.5లక్షల 33వేల 307 నిధులతో అప్పటి ఇన్‌చార్జి సర్పంచ్‌తో పాటు మరో ఎనిమిది మంది గుత్తేదారులు నామమాత్రమైన పనులు చేసి లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారు.

రెండుసార్లు బిల్లులు..

మండల కేంద్రంలో 2022లో అప్పటి ప్రజాప్రతినిధులు పలు అభివృద్ధి పనులు చేపట్టారు. మూడు నెలలు కాకముందే వాటికి సంబంధించి రెండు సార్లు బిల్లులు డ్రా చేసి ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించారు. ఈ తతంగం జరిగి దాదాపు రెండేళ్లు గడుస్తున్నా ఉన్నతస్థాయి అధికారులు చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేయడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

విచారణలో తేటతెల్లం..

బెజ్జూర్ గ్రామపంచాయతీలో రూ.5లక్షల 33వేల 307 నిధులు ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చేశారని కాగజ్‌నగర్ డీఎల్‌పీవో 2024లో జరిపిన విచారణలో తేటతెల్లమైంది. ఇంత జరిగినా సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో ఆలస్యం చేస్తుండటం వెనుక అనేక అనుమానాలు రేకెక్కుతున్నాయి. ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్‌ను వివరణ కోరగా, విచారణ జరిపించి సంబంధిత అధికారులపై త్వరలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విధులకు గైర్హాజరు కావద్దు



ఉద్యోగికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌చార్జి జీఎం సరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): విధులకు గైర్హాజరై ఉద్యోగాన్ని కోల్పోయి కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని బెల్లంపల్లి ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ నరేందర్ అన్నారు. శుక్రవారం గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు వివిధ కారణాలతో నిత్యం విధులకు గైర్హాజరు అయితే దాని ప్రభావం వారి కుటుంబంతో పాటు సంస్థపై పడుతుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి వేతనం, అన్ని సౌకర్యాలతో కూడిన సింగరేణి వంటి ఉద్యోగం లభించటం కష్టంగా ఉందన్నారు. ఉద్యోగులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే మంచి ఆసుపత్రులకు వెళ్లి స్పెషలిస్టు వైద్యులను సంప్రదించాలన్నారు. ఉద్యోగి కుటుంబ సభ్యులతో మాట్లాడి గైర్హాజరుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శేషయనరావు, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సీనియర్ పీవో శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

క్రీడా మైదానాలు కరువు..

- ఇబ్బంది పడుతున్న ప్రజలు, క్రీడాకారులు
- మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని డిమాండ్



యువకులు ఏర్పాటు చేసుకున్న మైదానం

సిర్పూర్(టి): క్రీడా మైదానాలు లేక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు ఒక్క గ్రామంలో కూడా క్రీడ మైదానం లేదు. క్రీడాకారులకు ఎలాంటి పోత్సాహం లేకపోవడంతో క్రీడాకారులు, యువకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది క్రీడాకారులు ప్రైవేట్ భూమిని చదును చేసుకొని క్రీడామైదానంగా తయారు చేసి ఆటలు ఆడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానం ఉన్నప్పటికీ పాఠశాల పని దినాలు కావడంతో క్రీడపోటీలు నిర్వహించ లేకపోతున్నారు. ప్రతీ సంవత్సరం క్రీడాకారులు క్రికెట్ టోర్నమెంట్, కబడ్డీ పోటీలతో పాటు ఇతర క్రీడలు నిర్వహించుకునేందుకు క్రీడా మైదానం లేకపోవడంతో ప్రభుత్వ సెలవు దినాల్లో లేదా ప్రైవేట్ వ్యక్తుల భూముల్లో ఆడాల్సి వస్తోందని వాపోతున్నారు.

పట్టణ ప్రజలకు ఇబ్బందులు..

మండల కేంద్రంలో ఎక్కడా కూడా క్రీడామైదానం లేకపోవడంతో యువతీ, యువకులతో పాటు ప్రజలకు వ్యాయయం, రన్నింగ్, వాకింగ్‌లు చేసుకునేందుకు ప్రధాన రహదారులను ఎంచుకుంటున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం ఉన్నప్పటికీ పక్కనే ఉన్న బీసీ వసతి గృహం, గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలకు క్రీడా మైదానాలు లేకపోవడంతో రెండు వసతి గృహాల యువకులు క్రీడా మైదానంలోనే ఉదయం, సాయంత్రం ఆటలు ఆడుతున్నారు. మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండలంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఎలాంటి ప్రోత్సాహం లేదు



మండల కేంద్రంలో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలు ఆడేందుకు యువకులు, క్రీడాకారులు డబ్బులు జమ చేసుకొని ప్రైవేట్ భూముల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. క్రీడలు ఆడేందుకు క్రీడామైదానం లేకపోవడంతో క్రీడాకారులకు ఎలాంటి ప్రోత్సాహం అందడం లేదు. ప్రభుత్వం స్పందించి క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి.

– సిద్ధు, సిర్పూర్(టి)

అధికారులు చొరవ తీసుకోవాలి



మండల కేంద్రంలో క్రీడా మైదానం లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. మండలంలోని క్రీడాకారుల సౌకర్యార్థం ప్రభుత్వం మినీ స్టేడియంకు భూమి కేటాయించి నిధులు మంజూరు చేయాలి. మినీ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలి.

– లక్ష్మణ్, సిర్పూర్(టి)

మానవత్వం చాటిన యువకులు

బెజ్జూర్: మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా మానసిక వికలాంగుడు తిరుగుతున్నాడు. అతడికి శుక్రవారం మండల కేంద్రానికి చెందిన తంగేడిపల్లి నిలేష్ ఆధ్వర్యంలో రామగిరి రాజన్న గుండు చేయించి తలస్నానం చేయించారు. అలాగే నూతన బట్టలు ధరింపజేయడంతో పాటు దగ్గరుండి అన్నం తినిపించారు. దీంతో వారిని మండల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో మెస్రం రాజారాం, పురుషోత్తం, సూరజ్ ఠాగుర్, భీంకర్, సంతోష్, శరన్, తదితరులు పాల్గొన్నారు.